సాక్షి నల్లగొండ

మంగళవారం । 15 । ఆగస్టు । 2023



పథకాలు అందాలి

సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజే యాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్ డిమాండ్ చేశారు. - IIలో



సఖ్యతకు అడ్డొస్తున్నాడనే..

సఖ్యతకు అడ్డొస్తున్నాడన్న కారణంతో ప్రియుడు, మరొకరితో కలిసి ఓ మహిళ తన భర్తను హత్య చేయించింది. - IIలో



స్వార్థం కోసమే దేశ విభజన

కొందరి స్వార్థం కోసమే దేశ విభజన చేశారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. - IIలో

న్యూస్‌రీల్

ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఎస్పీ అపూర్వరావు

నల్లగొండ క్రైం : పోలీస్ గ్రీవెన్స్‌డే ఫిర్యాదులను సత్వరం పరిష్కరించాలని ఎస్పీ అపూర్వరావు ఆదేశించారు. సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన బాధితుల ఫిర్యాదులను ఆమె స్వీకరించి మాట్లాడారు. భూ సమస్యలు, కుటుంబ తగాదాలు, అధిక వడ్డీ, ఉద్యోగాలు ఇప్పిస్తామని మోసం చేయడం వంటి ఫిర్యాదులపై సమగ్ర విచారణ జరిపి తగిన నివేదిక ఇవ్వాలని ఎస్‌ఐలను ఆదేశించారు. ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్ చేసి పర్యవేక్షిస్తున్నట్లు తెలిపారు. పోలీస్‌స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదును సమగ్రంగా విచారించి బాధితులకు భరోసా కల్పించాలన్నారు.

మెప్మా ఉద్యోగులకు పే స్కేల్

నల్లగొండ టూటౌన్ : మెప్మా కార్యాలయాల్లో పని చేస్తున్న ఉద్యోగులకు పే స్కేల్ వర్తింపజేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వం నాలుగేళ్ల క్రితం మెప్మా ఉద్యోగులందరికీ హెచ్‌ఆర్ సౌకర్యం కల్పించింది. అయితే తమకు పే స్కేల్ వర్తింపజేయాలని మెప్మా ఉద్యోగులు ప్రభుత్వ పెద్దలతో పాటు ఉన్నతాధికారులకు విన్నవించడంతో ప్రభుత్వం పే స్కేల్ వర్తింపజేయాలని నిర్ణయం తీసుకుని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ నిర్ణయంతో ఉమ్మడి జిల్లాలో 43 మంది ఉద్యోగులకు ప్రయోజనం చేకూరనుంది. ప్రభుత్వ నిర్ణయంపై మెప్మా ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు పోతెపాక సాంబయ్య సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

కొనసాగుతున్న మద్యం టెండర్లు

నల్లగొండ క్రైం : జిల్లాలో మద్యం దుకాణాలకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతోంది. సోమవారం 765 దరఖాస్తులు వచ్చినట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి సంతోష్ తెలిపారు. ఇప్పటి వరకు మొత్తం 2,397 దరఖాస్తులు వచ్చినట్లు వెల్లడించారు. ఈనెల 17, 18న మంచి రోజులు ఉండడంతో మరిన్ని దరఖాస్తులు వస్తాయని అధికారులు భావిస్తున్నారు.

ఆర్టీసీ సేవలను వినియోగించుకోవాలి

నల్లగొండ రూరల్ : ప్రయాణికులకు ఆర్టీసీ అందిస్తున్న సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఆర్‌ఎం శ్రీదేవి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణాల్లో ఐదు కిలోమీటర్ల పరిధిలో పల్లె వెలుగు బస్సుల్లో నెలకు రూ.500తో ప్రయాణ సౌకర్యం కలిపిస్తున్నామని తెలిపారు. ప్రయాణికులు కావాలనుకునే బస్సు ఎక్కడ ఉందో తెలుసుకునేందుకు గమ్యం యాప్‌ను ప్లేస్టోర్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. సీనియర్ సిటిజన్లకు ఆగస్టు 15న 50 శాతం రాయితీపై ప్రయాణ సౌకర్యం కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆరోగ్య ఉప కేంద్రాలకు నిధులు మంజూరు

మునుగోడు : నియోజకవర్గ పరిధిలోని నాలుగు మండలాల్లో 16 ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రాలకు నూతన భవనాల నిర్మాణానికి ప్రభుత్వం నిధులు మంజూరు చేసింది. ఒక్కో భవనానికి రూ.20 లక్షల చొప్పున ఆరోగ్యశాఖ నిధులు మంజూరయ్యాయి. మునుగోడు మండలంలోని పులిపలుపుల, ఊకొండి, చండూరు మండలంలోని బోడంగిపర్తి, గుండ్రపల్లి, పుల్లెంల, నెర్మట, ఘట్టుప్పల్, తేరటిపల్లి, నాంపల్లి మండలంలో పోచంపల్లి, గట్లమల్లేపల్లి, మర్రిగూడలో దామరభీమనపల్లి, లెంకలపల్లి, తిరుగండ్లపల్లి, అంతంపేట, కుదాబక్షపల్లి, శివన్నగూడెం గ్రామాల్లో ఉప కేంద్రాల నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి.

సమ్మె నోటీసు అందజేత




సమ్మె నోటీసు ఇస్తున్న సెకండ్ ఏఎన్‌ఎంలు

నల్లగొండ టౌన్ : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 16వ తేదీ నుంచి నిరవధిక సమ్మెలోకి వెళ్తున్నట్లు సెకండ్ ఏఎన్ఎంలు సోమవారం డీఎంహెచ్ఓ డాక్టర్ అనిమళ్ల కొండల్‌రావుకు సమ్మె నోటీసును అందజేశారు. రెగ్యులరైజ్ చేసేంత వరకు సమ్మె కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో గీత, వసంత, రత్నకుమారి, అనిత, పద్మ, ఆండాలు, స్వప్న, సంతోష, మంజుల, నిర్మల పాల్గొన్నారు.

చోటు దక్కేనా..!

బీఆర్‌ఎస్ మొదటి జాబితాపై ఉత్కంఠ

- నెలాఖరులోగా ఫస్ట్ లిస్ట్ వెలువడే అవకాశం
- ఉమ్మడి జిల్లాలో 8 మంది పేర్లు ప్రకటిస్తారని అంచనా
- పలు నియోజకవర్గాల్లో తెరపైకి వస్తున్న కొత్త పేర్లు
- కోదాడలో సిట్టింగ్ ఎమ్మెల్యేను కాదంటే మరో బీసీకి చాన్స్
- జూలూరి గౌరీశంకర్ పేరు పరిశీలన



సాక్షి ప్రతినిధి, నల్లగొండ: ఉమ్మడి జిల్లా బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ఈ నెలలోనే అభ్యర్థుల మొదటి జాబితా ప్రకటించేందుకు అధిష్టానం సిద్ధమవుతున్న తరుణంలో.. ఆ జాబితాలో ఎవరెవరి పేర్లు ఉంటాయనే దానిపై ఊహాగానాలు జోరందుకున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యేలకే టికెట్ ఇస్తామని సీఎం హామీ ఇచ్చినా అన్ని సర్వేల ఆధారంగానే అభ్యర్థులను ప్రకటిస్తారన్న ప్రచారం సాగుతుండటంతో ఆందోళన తప్పడం లేదు. టికెట్ ఇస్తారో లేదోనని కొందరు ఎమ్మెల్యేలు, అవకాశం వస్తుందో లేదోనని ఆశావహులు ఎదురుచూస్తున్నారు. రోజులు గడుస్తున్న కొద్దీ తెరపైకి కొత్త పేర్లు వస్తున్నాయి. మొదటి జాబితా వెలువడుతుందన్న ప్రచారంతో ఆశావహులంతా మంత్రి కేటీఆర్ అపాయింట్‌మెంట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు.

ఐదుగురి పేర్లు పక్కా!

ఐదు నియోజకవర్గాల్లో పోటీలో నిలిచే అభ్యర్థుల పేర్లు ఇప్పటికే పక్కాగా మొదటి జాబితాలో ప్రకటించే అవకాశం ఉంది. అందులో సూర్యాపేటలో మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, హుజూర్‌నగర్‌లో శానంపూడి సైదిరెడ్డి, తుంగతుర్తిలో గాదరి కిషోర్‌కుమార్, భువనగిరిలో పైళ్ల శేఖర్‌రెడ్డి, మిర్యాలగూడలో నల్లమోతు భాస్కర్‌రావు పేర్లు మొదటి జాబితాలో ఉంటాయనే ప్రచారం సాగుతోంది. మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు జిల్లాలో జరిగిన పలు సమావేశాలకు హాజరైన సందర్భంలో.. వచ్చే ఎన్నికల్లో వారిని భారీ మెజారిటీ గెలిపించాలని పిలుపునివ్వడమే ఇందుకు ఉదాహరణ. ఇక వారితోపాటు మరికొందరి పేర్లు కూడా మొదటి జాబితాలోనే ఉండే అవకాశం ఉంది. మొత్తానికి మొదటి జాబితాలో 8 మంది పేర్లను ప్రకటించే అవకాశాలు ఉన్నాయి.

వామపక్షాలతో పొత్తుకుదిరితే..

వామపక్షాలతో పొత్తు కుదిరితే మునుగోడును సీపీఐకి కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అది తేలేవరకు బీఆర్‌ఎస్ మునుగోడు అభ్యర్థి పేరును ప్రకటించడంలో జాప్యం చేసే అవకాశం ఉంది. పొత్తులేదంటే మరోసారి సిట్టింగ్‌ల కోటాలో కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికే టికెట్ అనే ప్రచారం సాగుతోంది. అయితే ఇక్కడి నుంచి ఆశావహులు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మరోవైపు దేవరకొండలోనూ కొంత ఆలస్యం అయ్యే అవకాశాలు ఉన్నట్లు తెలిసింది. ఆయనకు టికెట్ ఇవ్వొద్దంటూ నియోజకవర్గానికి చెందిన బీఆర్‌ఎస్ నేతలు డిండిలో ప్రత్యేకంగా సమావేశం పెట్టి మరీ తీర్మానించారు. దీంతో మొదటి జాబితాలో ప్రకటిస్తారా? లేదా? అభ్యర్థి మార్పు ఉంటుందా? అన్నది సందిగ్ధంగా ఉంది.

సాగర్‌లో ఆశావహుల జోరు

నాగార్జునసాగర్‌లో ఆశావహులు జోరు పెంచారు. సిట్టింగ్ ఎమ్మెల్యే నోముల భగత్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి వర్గాలు మొదటి నుంచి ఎడమొహం పెడమొహంగానే ఉంటున్నాయి. ఒకరి వర్గం సమావేశాలు నిర్వహిస్తే మరొకరి వర్గం నేతలు హాజరుకాని పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో టికెట్ కోసం ఆశావహులు జోరు పెంచారు. ముఖ్యంగా అక్కడి నుంచి టికెట్ ఆశిస్తున్న బుసిరెడ్డి ఫౌండేషన్ చైర్మన్ బుసిరెడ్డి పాండురంగారెడ్డి పెద్ద ఎత్తున సేవ కార్యక్రమాలు చేస్తున్నారు. మరోవైపు మన్నెం రంజిత్ యాదవ్ తన కార్యక్రమాలను కొనసాగిస్తున్నారు. కంచర్ల చంద్రశేఖర్ రెడ్డి కూడా తన కేసీఆర్ ఫౌండేషన్ పేరుతో కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో సాగర్ అభ్యర్థి పేరు మొదటి జాబితాలో ఉంటుందా? లేదా? అన్నది ప్రశ్నార్థకంగా మారింది.

మరో బీసీకి ఇవ్వాల్సి వస్తే 'జూలూరి'కి చాన్స్

కోదాడ నియోజకవర్గంలో సిట్టింగ్ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ టికెట్ తనకే వస్తుందన్న నమ్మకం పెట్టుకున్నారు. అయితే, సొంత పార్టీలోని అసమ్మతి ఆయనకు తలనొప్పిగా మారింది. నియోజకవర్గానికి చెందిన కన్మంతరెడ్డి శశిధర్‌రెడ్డి వంటి స్థానిక నేతలు ఆయన అభ్యర్థిత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. ఆయనకు సపోర్టు చేయబోమని ప్రత్యేకంగా సమావేశాలు పెట్టి మరీ తీర్మానించారు. ఈ నేపథ్యంలో అక్కడ ఎవరికి టికెట్ ఇస్తారన్న దానిపై సందిగ్ధం నెలకొంది. ఒకవేళ సిట్టింగ్ ఎమ్మెల్యేను మార్చాల్సి వస్తే అక్కడ మరో బీసీ నేతకే చాన్స్ ఇచ్చే అవకాశం ఉంది. అందులో తెలంగాణ తొలి బీసీ కమిషన్ సభ్యుడు, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరి గౌరీశంకర్ పేరు తెరపైకి వచ్చింది. తెలంగాణ ఉద్యమకారునిగా, సాహితీవేత్తగా ఉద్యమ సమయం నుంచి సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు దగ్గరగా ఉన్న ఆయనకు అవకాశం ఇస్తారనే చర్చ జోరుగా సాగుతోంది.

సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీకి ఎంపికలు

నల్లగొండ టూటౌన్ : తెలంగాణ రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ హైదరాబాద్‌లో ఈనెల 17, 18వ తేదీల్లో సైక్లింగ్, రెజ్లింగ్ అకాడమీలో ఉన్న ఖాళీలను భర్తీ చేసేందుకు 12 నుంచి 16 సంవత్సరాలలోపు బాలురకు ఎంపిక నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన క్రీడల అధికారి మక్బూల్ అహ్మద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు హైదరాబాద్‌లోని ఉస్మానియా యూనివర్సిటీ సమీపంలోని షాట్స్ సైక్లింగ్ వెల్లోడ్రం నందు హాజరు కావాలని కోరారు.

వనపర్తి, ఖమ్మం, సరూర్‌నగర్‌లో..

వనపర్తిలోని హాకీ అకాడమీలో, ఖమ్మంలోని అథ్లెటిక్స్ అకాడమీలో, హైదరాబాద్‌లోని సరూర్‌నగర్‌లోని వాలీబాల్ అకాడమీలో ఖాళీలను భర్తీ చేయడానికి 12 నుంచి 16 ఏళ్లలోపు బాలురకు ఎంపికలు నిర్వహిస్తున్నట్లు మక్బూల్ అహ్మద్ తెలిపారు. ఆసక్తి గల వారు ఈనెల 17వ తేదీన ఆయా జిల్లాల్లోని అకాడమీల్లో హాజరు కావాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9866317321 ఫోన్ నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరించాలి



ప్రజావాణిలో బాధితుల సమస్య వింటున్న కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, పక్కన అదనపు కలెక్టర్లు

- కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్

నల్లగొండ : ప్రజావాణి ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం గ్రీవెన్స్ డే సందర్భంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్‌తో కలిసి ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో రెవెన్యూ, సర్వే ల్యాండ్ కార్డ్స్, ఎస్సీ కార్పొరేషన్, మైనార్టీ సంక్షేమ శాఖ, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, గృహ నిర్మాణ తదితర శాఖలకు సంబంధించిన సమస్యలపై పెద్ద సంఖ్యలో ఫిర్యాదులు రాగా వాటిని వాటిని పరిశీలించి తగు చర్యలు తీసుకోవాని అధికారులను ఆదేశించారు.

“ భూమి నాకు ఇప్పించండి..



తిరుమలగిరిసాగర్ మండలం ఎల్లాపురం గ్రానికి చెందిన రమావత్ నారి భర్త చనిపోయాడు. అతని పేరు మీద ఉన్న భూమి చిన్న భార్య ద్వాలీ పట్టా చేయించుకుంది. నాకు రావాల్సిన వాటా ఇవ్వలేదు. నాకు రావాల్సిన భూమి ఇప్పించాలని ఆమె తన నలుగురు కుమార్తెలు లక్ష్మి, సరోజ, జ్యోతి, జాడ్లీతో కలిస కలెక్టర్‌కు విన్నవించింది.

పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబు



కలెక్టర్‌కు ఏర్పాట్లను వివరిస్తున్న ఎస్పీ

- ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్, ఎస్పీ



జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ముస్తాబవుతున్న వేదిక

నల్లగొండ క్రైం : స్వాతంత్య్ర దినోత్సవానికి జిల్లా పోలీస్ పరేడ్ గ్రౌండ్ ముస్తాబైంది. సోమవారం కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, అదనపు కలెక్టర్లు హేమంత్ కేశవ్ పాటిల్, జె.శ్రీనివాస్, కలెక్టరేట్ ఏఓ మోతీలాల్ ఏర్పాట్లను పరిశీలించారు. శకటాల ప్రదర్శన, విద్యార్థుల నృత్య కళా ప్రదర్శన, పోలీసుల మార్చ్ ఫాస్ట్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థుల నృత్యాలకు ఆటకం కలగకుండా మార్కింగ్ చేశారు. సందర్శకులకు ఇబ్బంది కలగకుండా గ్యాలరీలను ఏర్పాటు చేశారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరేడ్ గ్రౌండ్‌లోకి వచ్చే రెండు గేట్ల వద్ద బాంబ్ స్క్వాడ్ తనిఖీలు ఏర్పాటు చేశారు.

జయహో జనగణమన..



ఎన్జీ కళాశాల వద్ద జాతీయ గీతాలాపన చేస్తున్న స్థానికులు

యువతలో దేశభక్తి పెంపొందించాలనే నిశ్చయంతో జనగణమన ఉత్సవ సమితి 2021 జనవరి 23న నేతాజీ సుభాష్ చంద్ర బోస్ జయంతి రోజున నల్లగొండ పట్టణంలోని ప్రధాన కూడళ్లలో నిత్య జాతీయ గీతాలపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. నాటి నుంచి నిర్విరామంగా జాతీయ గీతాలాపన కార్యక్రమం కొనసాగుతోంది. దీని కోసం పట్టణంలోని ప్రధాన రహదారిలో మైక్‌లను ఏర్పాటు చేశారు. రోజూ ఉదయం 8.30 గంటలకు ప్రధాన కూడళ్లలో జాతీయ గీతాలపన ప్రారంభమవుతుంది. గీతాలాపన సమయంలో రోడ్లపై వెళ్తున్న పాదాచారులు, వాహనదారులు స్వీ య క్రమశిక్షణతో జాతీయ గీతం ఆలపిస్తారు.

ఇతర ప్రాంతాలకు విస్తరణ..

మొదటగా నల్లగొండ పట్టణంలో నిత్య జాతీయ గీతాలాపన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ప్రజల నుంచి మంచి స్పందన రావడంతో ఇతర ప్రాంతాల్లో కూడా ఈ కార్యక్రమాన్ని విస్తరించారు. 2022 జనవరి 27న తిప్పర్తిలో, 2022 ఆగస్టు 15న నార్కట్‌పల్లి మండల కేంద్రంలో, ఆ తర్వాత పానగల్లు పట్టణంలో ప్రారంభించారు. త్వరలో త్రిపురారం, చండూరు, హాలియాలో ప్రారంభించనున్నారు.

“ దేశభక్తిని అలవర్చుకోవాలి



విజయ్‌కుమార్



రవికుమార్

ఎంతో మంది తమ ప్రాణాలు త్యాగం చేయడం వల్లే దేశానికి స్వాతంత్య్రం సిద్ధించింది. వారి త్యాగాలను గుర్తు చేసుకోవాల్సిన బాధ్యత మనపై ఉంది. ముఖ్యంగా చిన్నారులు, యువత దేశభక్తిని అలవర్చుకోవాలి. దేశం నాది అనే భావం అందరిలో కలగాలి. నిత్య జాతీయ గీతాలపన కార్యక్రమానికి ప్రజల నుంచి మంచి స్పందన వస్తోంది. ఇదే స్ఫూర్తితో ఇతర మండలాల్లో కూడా విస్తరించేందుకు జనగణమన ఉత్సవ సమితి ప్రయత్నిస్తోంది.

- కర్నాటి విజయ్‌కుమార్, జనగణమన ఉత్సవ సమితి అధ్యక్షుడు
- కొలనుపాక రవికుమార్, ప్రధాన కార్యదర్శి

దేశ సేవలో సంతృప్తి

ఎముకలు కొరికే చలితో సహజీవనం.. జారిపడే మంచు దిబ్బలతో నిత్యం పొంచి ఉండే ప్రమాదం. వీటికి మించి దాడి చేసేందుకు సిద్ధంగా ఉండే శత్రుసైన్యం మరోపక్క. సంవత్సరాల తరబడి కుటుంబాలకు దూరంగా ఉండడంతో ఎదురయ్యే మానసిక, శారీరక సమస్యలను అధిగమిస్తూ మాతృదేశ సేవలో తరిస్తున్నారు మన సైనికులు. స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా పలువురు మాజీ సైనికులు వెల్లడించిన అనుభవనాలు ఇవీ..

- నల్లగొండ డెస్క్



- సియాచిన్‌లో డ్యూటీ సవాలే..
- ఆపరేషన్ మేఘ్‌దూత్‌లో పాల్గొన్న
- ఆ సమయంలో నా కాలు కోల్పోయా
- మాజీ సైనికుడు రేపాక శ్రీధర్‌రెడ్డి

'దేశ సేవలోనే ఎంతో సంతృప్తి ఉంది. ఎముకలు కొరికే చలిలో పనిచేయడం సవాల్‌తో కూడుకున్న విషయం' అని చెప్పారు నల్లగొండలోని పానగల్లుకు చెందిన మాజీ సైనికుడు రేపాక శ్రీధర్‌రెడ్డి. స్వాతంత్య్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆయన 'సాక్షి'తో మాట్లాడుతూ సియాచిన్‌లో డ్యూటీ చేసినప్పటి అనుభవాలను పంచుకున్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

1986లో ఆర్మీలో చేరాను. మొదట సీఆర్‌పీఎఫ్‌కు ఎంపికైతే కుటుంబ సభ్యులు వద్దన్నారు. సైన్యంలో ఎంపికకు మాత్రం ఇంట్లో వాళ్లకు చెప్పకుండా వెళ్లాను. సైన్యంలోకి ఎంపిక నల్లగొండలో జరిగింది. అప్పుడు 15 మంది మాత్రమే వచ్చారు. సైన్యంలో శిక్షణ పూర్తయిన తర్వాత మద్రాస్ రెజిమెంట్‌లో చేరాను. మొదటిసారే సియాచిన్ పర్వతాల్లో డ్యూటీ పడింది. అక్కడ అత్యంత చలి ఉంటుంది. వాతావరణం మైనస్ 40 డిగ్రీలుంటుంది. ఆ వాతావరణానికి అలవాటు పడదానికి లే-లడహక్‌లో ఏడాదిన్నర ఉంచారు. ఆ ప్రాంతంలో భారత్, పాకిస్తాన్ సైనికుల మధ్య నిరంతరం కాల్పులు జరుగుతుండేవి. సియాచిన్‌లో 1984లో ప్రారంభమైన ఆపరేషన్ మేఘ్‌దూత్.. వాజ్‌పేయి ప్రధాన మంత్రి అయిన సమయం వరకు కొనసాగింది. ఆ తర్వాత ఇరు దేశాల మధ్య జరిగిన ఒప్పందంతో కాల్పులు ముగిశాయి. ఈ ఆపరేషన్‌లో మొత్తంగా 11 మంది జవాన్లు వీరమరణం పొందారు. నేను 1989లో ఆపరేషన్ మేఘ్‌దూత్‌లో పాల్గొన్నాను. మా ముందు వెళ్లిన ఫోర్స్‌ను పికప్ చేసుకోవడానికి మేము వెళ్లాము. మా ఫోర్స్‌లో 30 మంది జవాన్లు ఉన్నారు. అకస్మాత్తుగా మంచు చరియలు విరిగిపడడంతో మా బృందంలో నలుగురు మరణించగా నేను తీవ్రంగా గాయపడ్డాను. సరిహద్దు ప్రాంతం నుంచి బేస్‌క్యాంపు వరకు సహచర జవాన్లు తీసుకువచ్చారు. మమ్మల్ని తీసుకెళ్లడానికి సైన్యానికి చెందిన చిన్న విమానాలు బేస్ క్యాంపు వరకే వస్తాయి. అక్కడి నుంచి చండీగఢ్‌లోని మిలటరీ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. పది రోజుల సమయం పట్టింది. గాయం పెద్దది కావడంతో కాలు కింది భాగం తీసేశారు. ఆరు నెలలు చికిత్స పొంది కోలుకున్న తర్వాత మిలటరీ కార్యాలయాల్లో క్లర్క్‌గా ఉద్యోగం ఇచ్చారు. సైనిక విధులు కాకుండా.. క్లరికల్ పోస్టులో పనిచేసి 2003 సంవత్సరంలో రిటైర్డ్ అయ్యాను. ఆ తర్వాత 2009లో కోర్టు ఉద్యోగానికి ఎంపికయ్యాను. ప్రస్తుతం నల్లగొండ జిల్లా కోర్టులో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్నా. నాకు భార్య, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. ఇప్పుడు సియాచిన్‌లో డ్యూటీ చేసే సైనికులకు సౌకర్యాలు పెరిగాయి. అలవెన్స్‌లు కూడా ప్రభుత్వం పెంచింది. అప్పుడు సైన్యంలో మరణిస్తే అక్కడే అంత్యక్రియలు చేసేవారు. జవాన్‌కు సంబంధించిన దుస్తులు, కిట్ మాత్రమే ఇంటికి పంపేవారు. కార్గిల్ యుద్ధం తర్వాత సైనికుల మృతదేహాలను వారి స్వగ్రామాలకు పంపుతున్నారు.



తన అనుభవాలను వివరిస్తున్న శ్రీధర్‌రెడ్డి



నల్లగొండలో జాతీయ జెండాతో యోగా ట్రైనర్ సంధ్య

కళ్లముందు దేశమే కనిపించింది..

- మాజీ సైనికుడు దోమకొండ సుధాకర్



మిర్యాలగూడ పట్టణంలోని ఈదులగూడకు చెందిన నేను డిగ్రీ చివరి సంవత్సరంలో 1991లో ఆర్మీలో చేరాను. వివిధ హోదాల్లో పనిచేసి 2008 జూలై 31న రిటైర్ అయ్యాను. నేను 1999 మే 3న 8,500 ఫీట్ల ఎత్తులో ఉన్న కార్గిల్ కొండను ఆక్రమించిన పాకిస్తాన్ సైనికులతో జరిగిన యుద్ధంలో పాల్గొన్నా. కార్గిల్ ఎడ్జ్ ఏరియాలో ఉన్న మేము పాకిస్తాన్ సైనికులు కార్గిల్ కొండను ఆక్రమించారని తెలుసుకుని బృందాలుగా విడిపోయాం. ఒక్కో బృందంలో 400 మందికి పైగా ఉన్నారు. 320 ఫీల్డ్ రెజిమెంట్‌లో ఒక సభ్యుడిగా నేను 130ఎంఎం గన్స్‌తో యుద్ధ రంగంలోకి దిగాను. నా కళ్ల ముందే మా బృందం కెప్టెన్ సత్నంసింగ్‌తో పాటు ఇద్దరు జూనియర్ కమిషనర్ ఆఫీసర్లు, నలుగురు జవాన్లు నేల కొరిగారు. పది మందికి పైగా కాళ్లు, చేతులు తెగిపోయి విగత జీవులుగా మిగిలారు. 1999 మే 3వ తేదీన ప్రారంభమైన కార్గిల్ యుద్ధం జూలై 24న ముగిసింది. జూలై 26న కార్గిల్ యుద్ధ విజయోత్సవాలు జరుపుకున్నాం. ఆ యుద్ధంలో పాల్గొన్న నన్ను ప్రభుత్వం 'ఓపీ విజయ్' మెడల్‌తో సత్కరించింది.

రిటైర్మెంట్ తర్వాత చిన్నచూపు

దేశ సరిహద్దులో ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడిన మమ్మల్ని రిటైర్డ్ అయ్యాక ప్రభుత్వం చిన్న చూపు చూస్తోంది. వన్‌ర్యాంక్.. వన్ పెన్షన్ విధానం కావాలని అనేక ఏళ్లుగా పోరాడుతున్నాం. దేశానికి సేవ చేశామనే సంతృప్తి ఉన్నా.. మా త్యాగాలను గుర్తించి మాకు రావలసినవి పూర్తిస్థాయిలో ఇవ్వకపోవడం కొంత నిరాశగా ఉంది.

దేశం మీద ప్రేమతోనే సైన్యంలోకి..

- మాజీ సైనికుడు కృష్ణ



చిలుకూరు మండలం బేతవోలుకు చెందిన నేను దేశం మీద ప్రేమతో 2003 జూలైలో ఆర్మీలో చేరాను. బెంగళూరులో శిక్షణ పూర్తయ్యాక చండీఘర్, మణిపూర్, జమ్ముకశ్మీర్, రాజస్థాన్, అరుణాచల్‌ప్రదేశ్, పంజాబ్, పశ్చిమబెంగాల్‌లో పనిచేశా. రాజస్థాన్‌లో పదవీ విరమణ పొందాను. 2008లో జమ్ముకశ్మీర్‌లోని బాలాపూర్‌లో పని చేస్తున్నప్పుడు జరిగిన ఆపరేషన్‌లో ధైర్యంగా పాల్గొన్నా. అరుణాచల్‌ప్రదేశ్‌లోని టవాంగ్‌లో మేము ఉన్న ప్రదేశం సముద్ర మట్టం నుంచి 1400 అడుగుల ఎత్తులో ఉండేది అక్కడ శ్వాస కూడా సరిగా ఆడేది కాదు ఆ సమయంలో దేశ రక్షణే ధ్యేయంగా పని చేశాను.

నాన్న మృతి చెందిన వారం తర్వాత వచ్చా..

శ్రీనగర్‌లో పని చేస్తున్నప్పుడు 2009 ఆగస్టు 14వ తేదీన అనారోగ్యంతో మా నాన్న మృతి చెందారు. మాకు ఆగస్టు 13,14,15, జనవరి 24,25,26 తేదీల్లో సెలవులు ఇవ్వరు. మా నాన్న చనిపోయారని చెబితే ఆగస్టు 18న సెలవు ఇచ్చారు. ఇంటికి వచ్చే సరికి 21వ తేదీ అయ్యింది. నేను వచ్చాకే దహన సంస్కారాలు చేశారు. ఆ సమయం నేను చాలా బాధపడ్డా. నా 20 ఏళ్ల సర్వీసులో నేను పని చేసిన ప్రతిచోటా సహచరులమంతా కలిసిమెలిసి ఉండేవాళ్లం.

క్లుప్తంగా

పట్టా చేసేందుకు వచ్చి పరలోకాలకు..

● అనారోగ్యంతో తహసీల్దార్ కార్యాలయంలోనే వృద్ధుడి మృతి


నర్సింహ మృతదేహం

మునుగోడు: తన పేరిట ఉన్న భూమిని మనుమడి పేరిట పట్టా చేసేందుకు వచ్చిన ఓ వృద్ధుడు తహసీల్దార్ కార్యాలయంలోనే కుప్పకూలి మృతిచెందాడు. ఈ విషాదకర ఘటన మునుగోడులో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు, ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మునుగోడు మండలం ఇప్పర్తి గ్రామానికి చెందిన మహేశ్వరం పెద్ద నర్సింహ (80) తన పేరు మీద ఉన్న 32 గుంటల భూమిని కొడుకు కుమారుడు నర్సింహకు పట్టా చేసేందుకు ఉదయం కార్యాలయానికి తీసుకువచ్చారు. అయితే, నర్సింహ పట్టామార్పిడి బుక్‌పై సంతకం (వేలిముద్ర) పెట్టక ముందే అపస్మారక స్థితిలోకి వెళ్లి ఉన్నచోటనే కుప్పకూలాడు. కుటుంబ సభ్యులు అతడిని స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు.

వేర్వేరు ప్రమాదాల్లో నలుగురికి గాయాలు

నార్కట్‌పల్లి : నిలిచున్న లారీని ఆర్టీసీ బస్సు వెనుక నుంచి ఢీకొనడంతో ముగ్గురికి గాయాలయ్యాయి. హైదరాబాద్ వైపు వెళ్తున్న లారీని తెల్లవారుజామున మండల కేంద్రంలోని నార్కట్‌పల్లి- అద్దంకి రహదారిపై సూచిక బోర్డులు పెట్టకుండా డ్రైవర్ నిలిపాడు. దీంతో హైదరాబాద్ వైపు ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు డ్రైవర్ లారీని గమనించక వెనుక వైపు నుంచి ఢీకొట్టాడు. ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. వారిని కామినేని ఆస్పత్రికి తరలించారు.

కారు ఢీకొని..

రామగిరి(నల్లగొండ): తిప్పర్తి మండలం మామిడాల గ్రామానికి చెందిన కందుల మణికంఠ సోమవారం బైక్‌పై నకిరేకల్ రోడ్డు వైపు వెళ్తున్నాడు. మామిడాల సమీపంలో మలుపు వద్ద ఎదురుగా వస్తున్న కారు మణికంఠ బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మణికంఠకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు అతడిని చికిత్స నిమిత్తం నల్లగొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

సఖ్యతకు అడ్డొస్తున్నాడనే..

● వీడిన పొడిచేడు హత్య కేసు మిస్టరీ
● హతుడి ఇల్లాలు, ఆమె ప్రియుడే సూత్రధారులు
● మరో పాత్రధారుడితో కలసి ఘాతుకం
● కేసు ఛేదనలో కీలకంగా వ్యవహరించిన డాగ్‌స్క్వాడ్
● ముగ్గురు నిందితుల అరెస్ట్, రిమాండ్


కేసు వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రాజేష్‌చంద్ర

భువనగిరి : యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మండలం పొడిచేడు గ్రామంలో ఇటీవల వెలుగు చూసిన ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన బోర్‌వెల్ డ్రిల్లర్ సల్ల సైదులు హత్య కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. సఖ్యతకు అడ్డొస్తున్నాడన్న కారణంతో హతుడి ఇల్లాలు, ఆమె ప్రియుడు, మరో పాత్రధారుడితో కలసి ఘాతుకానికి ఒడిగట్టినట్లు పోలీసుల విచారణలో వెల్లడైంది. అరెస్ట్ చేసిన ముగ్గురు నిందితులను సోమవారం డీసీపీ రాజేష్ చంద్ర భువనగిరిలో మీడియా ఎదుట ప్రవేశపెట్టి కేసు వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు(ఎం) మండలం లింగరాజుపల్లి గ్రామానికి చెందిన సల్ల సైదులుకు శాలిగౌరారం మండలం గురజాల గ్రామానికి చెందిన ధనలక్ష్మితో 12 ఏళ్ల క్రితం వివాహమైంది.వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నాయి.సైదులు బోర్‌వెల్‌పై డ్రిల్లర్‌గా పనిచేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. ఏడాది క్రితం గ్రామానికి వచ్చి కట్టెకోత పనికి వెళ్తున్నాడు.

మూడేళ్లుగా వివాహేతర సంబంధం

సైదులు బోర్‌వెల్ డ్రిల్లర్‌గా పనిచేస్తున్న క్రమంలో నెలల తరబడి విధి నిర్వహణలో ఉంటూ అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్తుండేవాడు. దీంతో ధనమ్మ తరచూ గురజాలలోని పుట్టింటి వద్దే ఎక్కువగా ఉంటుండేది. ఈ క్రమంలో అదే గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎడ్ల నవీన్‌తో మూడేళ్ల క్రితం ధనలక్ష్మికి ఏర్పడిన పరిచయం వివాహేతర సంబంధానికి దారి తీసింది. ధనలక్ష్మి తరచూ పుట్టింటికి వెళ్తుండడంతో సైదులు అనుమానించాడు. దీంతో దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడి కుటుంబంలో కొంతకాలంగా గొడవలు జరుగుతున్నాయి. విషయం పెద్దమనుషుల వద్దకు చేరడంతో సర్దిచెప్పగా ప్రస్తుతం సజావుగానే కాపురం సాగుతోంది.

బోనాల పండుగకు రప్పించి..

ధనలక్ష్మిని పుట్టింటికి వెళ్లనీయకుండా తమ సఖ్యతకు సైదులు అడ్డొస్తున్నాడని ఎడ్ల నవీన్ కక్ష పెంచుకున్నాడు. అతడిని ఎలాగైనా అంతమొందించాలని ప్రియురాలు ధనలక్ష్మితో కలసి పథకం రచించాడు. ఈ నేపథ్యంలోనే సైదులు, ధనలక్ష్మి, పిల్లలను తీసుకుని ఈ నెల 10వ తేదీన గురజాలలోని పుట్టింటికి వచ్చారు. అనుకున్న పథకం ప్రకారం సైదులు హత్య చేసేందుకు నవీన్ తన సమీప బంధువు స్వామి సహాయం కోరాడు. అందుకు అతడు ఒప్పుకోవడంతో ఈ నెల 11వ తేదీన ఇద్దరూ కలసి ధనలక్ష్మి పుట్టింటికి వచ్చారు. అనంతరం మద్యం తాగేందుకు సైదులును వెంటబెట్టుకుని ఆటోలో అమ్మనబోలుకు వెళ్లారు. అక్కడ నవీన్, స్వామి, సైదులు మద్యం తాగారు. పూటుగా మద్యం తాగిన సైదులు అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. అనంతరం నవీన్, స్వామి ఇద్దరూ కలసి ఆటో స్టార్ట్ చేసేందుకు ఉపయోగించే తాడుతో సైదులు మెడకు ఉరి బిగించారు. అనంతరం సైదులు ఆటోలో వేసుకుని మోత్కూరు మండలం పొడిచేడులోని మూసీ నది బ్రిడ్జి వద్ద మట్టిరోడ్డులోకి వెళ్లి చనిపోయాడో లేదోనని మరో సారి తాడుతో ఉరి బిగించి ఘాతుకానికి ఒడిగట్టారు. ఆపై మృతదేహాన్ని పొడిచేడులోని మూసీ నది ఒడ్డున గంగదేవమ్మ ఆలయం సమీపంలో పడవేసి వెళ్లిపోయారు.

నిందితుడిని గుర్తించిన డాగ్‌స్క్వాడ్

మోత్కూరు మండలం పొడిచేడు గ్రామంలోని మూసీ నది ఒడ్డున వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సైదులు మెడకు రెండు చోట్ల తాడుతో ఉరిబిగించినట్లు ఆనవాళ్లు ఉండడంతో హత్యేనని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. అప్పటికే విషయం తెలుసుకుని ఘటనా స్థలానికి వచ్చిన హతుడి తల్లి గురజాలకు చెందిన నవీన్‌పై అనుమానం వ్యక్తం చేసింది. ఘటనా స్థలంలో ఆటో గుర్తులను గుర్తించిన పోలీసులు పోలీస్ డాగ్‌స్క్వాడ్‌ను రప్పించి ఆధారాలు సేకరించారు. అయితే, అప్పటికే నవీన్ తన ఆటోలో ధనలక్ష్మి తల్లితో పాటు ఇతర కుటుంబ సభ్యులను ఆటోలో ఘటనా స్థలానికి తీసుకువచ్చాడు. దీంతో పోలీస్ జాగిలం సైదులు మృతదేహాన్ని తీసుకువచ్చిన ఆటో చుట్టూ తిరగడంతో పాటు నవీన్‌ను గుర్తించింది. అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించాడు. మిగతా ఇద్దరు నిందితులు హైదరాబాద్‌కు పారిపోతుండగా అనాజిపురం వద్ద పట్టుకున్నట్లు డీసీపీ వివరించారు. వారి వద్ద హత్యకు ఉపయోగించిన తాడు, రెండు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు ఛేదనలో పోలీస్ డాగ్‌స్క్వాడ్ కీలకంగా వ్యవహరించిందని డీసీపీ చెప్పారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ రవికుమార్, ఏసీపీ మొగులయ్య, రామన్నపేట సీఐ మోతీరాం, మోత్కూర్ ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి ఉన్నారు.

చిట్టీల వ్యాపారి టోకరాపై పోలీసుల ఆరా

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం ఆకారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి చిట్టీల పేరిట సభ్యులను నిండా ముంచి రూ.4కోట్లతో ఉడాయించిన ఉదంతంపై సోమవారం పోలీసులు ఆరా తీశారు. 'పరారీలో చిట్టీల వ్యాపారి' అనే శీర్షికన సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి పోలీస్ ఉన్నతాధికారులు స్పందించారు. వారి ఆదేశాల మేరకు శాలిగౌరారం పోలీసులు ఆకారం గ్రామానికి చేరుకొని ఘటనపై సమాచారం సేకరించే పనిలో నిమగ్నమయ్యారు. వ్యాపారి చేతిలో మోసపోయిన ఇద్దరు బాధితులు మాత్రమే పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తుంది. ఈ విషయంపై ఎస్‌ఐ సతీష్‌ను వివరణ కోరగా చిట్టీల వ్యాపారి పరారీ ఘటనపై దర్యాప్తు ప్రారంభించామన్నారు. వందల సంఖ్యలో ఉన్న బాధితుల్లో ఇద్దరు మాత్రమే పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారని, మరికొందరు కూడా ముందుకు వస్తే దర్యాప్తు పూర్తిస్థాయిలో చేపట్టనున్నట్లు వివరించారు. ఇదిలా ఉండగా మండల కేంద్రంలో ఏ కూడలిలో చూసినా, ఎక్కడ నలుగురు గుమిగూడినా సాక్షి కథనం గురించే చర్చించుకోవడం కనిపించింది.

చికిత్స పొందుతున్న మహిళ మృతి

భువనగిరి : ఒంటిపై కిరోసిన్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన మహిళ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందింది. భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామానికి చెందిన గంగాపురం లక్ష్మమ్మ(33) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈ నెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఒంటి పై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. ఇదే సమయంలో భర్త పెంటయ్య ఇంటికి రాగా అప్పటికే కాలుతున్న భార్యను చూశాడు. వెంటనే మంటలు ఆర్పి ఆమెను భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ చికిత్స పొందుతూ లక్ష్మమ్మ సోమవారం ఉదయం మృతి చెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ ఎస్‌ఐ సంతోస్‌కుమార్ తెలిపారు.

కాలం చెల్లిన బీర్లు విక్రయిస్తున్నారని..

● చింతపల్లిలో మందుబాబుల ఆందోళన

చింతపల్లి : కాలం చెల్లిన బీర్లు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ మందుబాబులు చింతపల్లి మండల కేంద్రంలోని ఓ వైన్స్ ఎదుట సోమవారం రాత్రి ఆందోళనకు దిగారు. ఓ కంపెనీకి చెందిన బీరుకు ఈ నెల 1వ తేదీన గడువు ముగిసినా విక్రయించారని దుకాణం నిర్వాహకులతో వాగ్వాదానికి దిగారు. తాము గడువుతీరిపోయిన విషయాన్ని గుర్తించలేదని సదరు వైన్స్ దుకాణదారుడు పేర్కొనడం గమనార్హం. ఇదిలా ఉంటే ఈ విషయమై పలువురు బీజేపీ నాయకులు ఎక్సైజ్ సీఐకు ఫిర్యాదు చేశారు.

పురుగుల మందు తాగి ఆత్మహత్య

గుర్రంపోడు : పురుగుల మందు తాగి ఓ రైతు ఆత్మహత్య చేసుకున్నాడు. గుర్రంపోడు మండలం తేనపల్లి గ్రామానికి చెందిన బొమ్ము వెంకటయ్య(35) వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఏమైందో తెలియదు కానీ వెంకటయ్య ఇంట్లోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని నల్లగొండ ఆస్పత్రికి తరలిస్తుండగా కనగల్ సమీపంలో మృతిచెందాడు. ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

అర్హులందరికీ పథకాలు అందాలి

● కాంగ్రెస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న కాంగ్రెస్ నాయకులు

నలగొండ : తెలంగాణ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ అందజేయాలని డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్ నాయక్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. అంతకు ముందు భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి క్యాంపు కార్యాలయం నుంచి కలెక్టరేట్ వరకు కాంగ్రెస్ పార్టీ నల్లగొండ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్ నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అధికార పార్టీ నాయకులకే అందుతున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య జూకూరి రమేష్, గడ్డం అనుప్ రెడ్డి, బొజ్జా శంకర్, సమద్, ఏర్పుల రవి, గడిగ శ్రీను, జూలకంటి శ్రీనివాస్, జిల్లపల్లి పరమేష్, శంకర్, పెరిక వెంకటేశ్వర్లు, నాంపల్లి భాగ్య, కత్తుల కోటి, నన్నూరి విష్ణువర్ధన్‌రెడ్డి, పాదూరి శ్రీనివాసరెడ్డి, పాండయ్య, జూలకంటి సైదిరెడ్డి, మందడి శ్రీనివాస్ రెడ్డి, యూత్ కాంగ్రెస్ నాయకులు గాలి నాగరాజు పాల్గొన్నారు.

స్వార్థం కోసమే దేశ విభజన

నల్లగొండ టూటౌన్ : కొందరి స్వార్థం కోసమే దేశ విభజన చేశారని బీజేపీ నల్లగొండ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. దేశ విభజనకు నిరసనగా బీజేపీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు సోమవారం బీజేపీ నాయకులు నల్లగొండలోని బీజేపీ కార్యాలయం నుంచి సుభాష్ విగ్రహం వరకు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ భారతదేశాన్ని విభజించడం వల్ల అనేక మంది నిరాశ్రయులయ్యారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గోలి మధుసూదన్‌రెడ్డి, కన్మంతరెడ్డి శ్రీదేవిరెడ్డి, వీరెల్లి చంద్రశేఖర్, నాగం వర్షిత్‌రెడ్డి, యాదగిరాచారి, చింత ముత్యాల్‌రావు, అయితరాజు సిద్ధు, పాలకూరి రవిగౌడ్ పాల్గొన్నారు.

సాగు నీరు విడుదల చేయాలని వినతి

నల్లగొండ టూటౌన్ : రైతాంగానికి సాగు నీరు అందించడానికి నాగార్జునసాగర్ ఎడమ కాల్వకు, ఎస్ఎల్‌బీసీ వరద కాల్వకు నీటిని విడుదల చేయాలని కోరుతూ బీజేపీ కిసాన్ మోర్చా ఆధ్వర్యంలో సోమవారం నల్లగొండ కలెక్టర్ కర్ణన్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం పార్టీ కిసాన్ మోర్చా జాతీయ కార్యవర్గ సభ్యుడు గోలి మధుసూదన్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. సాగు నీటి కోసం రైతులందరూ ఎదురు చూస్తున్నారని, వరి నార్లు పోసుకొని నీరు లేక రైతులు అవస్థలు పడుతున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వానికి రైతాంగం పట్ల చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వినతి పత్రం అందజేసిన వారిలో పార్టీ నాయకులు వీరెల్లి చంద్రశేఖర్, దప్పిలి కోటేశ్వర్‌రెడ్డి, జగ్జీవన్‌రాం, పోతెపాక లింగస్వామి తదితరులు ఉన్నారు.


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు


24వరకు గాంధీ సినిమా ఉచిత ప్రదర్శన

● నల్లగొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్


నల్లగొండలో విద్యార్థులతో కలసి గాంధీ చిత్రాన్ని వీక్షిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తదితరులు

నల్లగొండ : గాంధీ సినిమాను ఈ నెల 24వ తేదీ వరకు జిల్లాలోని అన్ని థియేటర్లలో ఉచితంగా ప్రదర్శించబడుతుందని నల్లగొండ అదనపు కలెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. అన్ని వర్గాల ప్రజలు ఉచితంగా వీక్షించేలా ఏర్పాట్లు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. సోమవారం నల్లగొండ పట్టణంలోని వెంకటేశ్వర థియేటర్‌లో గాంధీ సినిమాను ఆయన ఆర్డీఓ రవి, డీపీఆర్‌ఓ శ్రీనివాస్, ఎంఈఓలు నర్సింహ, అరుంధతిలతో కలిసి వీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత స్వాతంత్ర్య వజ్రోత్సవాల ముగింపు సందర్భంగా సినిమాను ఉచితంగా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. సోమవారం చండూర్, చిట్యాల, దేవరకొండ, మాల్, మిర్యాలగూడ, నల్లగొండ, నాంపల్లి థియేటర్లలో 6,255 మంది విద్యార్థులు వీక్షించినట్లు తెలిపారు. ఈనెల 15, 20 తేదీలు ప్రభుత్వ సెలవులు మినహాయించి 24 వ తేదీ వరకు ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు గాంధీ చిత్రం ఉచిత ప్రదర్శన ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల ఉపాధ్యాయులు, యాజమాన్యాలు తమ విద్యార్థులందరూ చిత్రాన్ని వీక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

రేషన్ దుకాణాల తనిఖీ


రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

నార్కట్‌పల్లి : మండల కేంద్రంతోపాటు గోపలాయపల్లిలోని పలు రేషన్ దుకాణాలను ఎఫ్‌సీఐ కేంద్ర బృందం అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ప్రతి బియ్యం బస్తా నుంచి షాంపిల్స్ తీసుకోవడంతోపాటు రికార్డులను పరిశీలించారు. వారి వెంట సివిల్ సప్లయ్ మేనేజర్ చోప్రా, ఆర్‌ఐ తరుణ్ తదితరులున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ


రవి ఇంట్లో చిందరవందరగా ఉన్న వస్తువులు

ఆలేరురూరల్ : గుర్తుతెలియని వ్యక్తులు తాళం వేసిన ఇంట్లో చోరీకి పాల్పడ్డారు. ఆలేరులో చోటుచేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఆలేరు మున్సిపాలిటీ పరిధి 1వ వార్డులోని ఈదమ్మ గుడి సమీపంలో నివాసముంటున్న శ్రీరామోజు రవి శనివారం సాయంత్రం కుటుంబ సభ్యులతో కలసి బంధువుల ఇంటికి వెళ్లారు. సోమవారం ఉదయం వచ్చేసరికి ఇంటి తలుపులు తెరిచి ఉండడంతో అవాక్కయ్యారు. ఇంట్లోకి వెళ్లి పరిశీలించగా బీరువా తెరిచి అందులో ఉన్న ఆరు తులాల బంగారు నగలు, రూ.15వేల నగదు దొంగలు ఎత్తికెళ్లినట్లు గుర్తించారు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా ఎస్‌ఐ వెంకటశ్రీను ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆదివారం రాత్రి దొంగతనం జరిగినట్లు భావిస్తున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ చెప్పారు.

ముగ్గురు గంజాయి విక్రేతల అరెస్ట్


సాయితేజ | మహేష్ | ధీరజ్

అడ్డగూడూరు : ముగ్గురు గంజాయి విక్రేతలను యాదాద్రి జిల్లా పోలీసులు అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 300 గ్రాముల స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సికింద్రాబాద్‌లోని వారాసిగూడకు చెందిన కనుకు సాయితేజ, మహేష్, ధీరజ్‌లు కొంతకాలంగా నిషేధిత గంజాయి వ్యాపారం చేస్తున్నారు. వీరు యాదాద్రి భువనగిరి జిల్లా అడ్డగూడూరు మండలంలో గంజాయిని విక్రయించేందుకు సోమవారం సికింద్రాబాద్ నుంచి బస్సులో బయలుదేరారు. అడ్డగూడూరు మండలం చిర్రగూడూరు స్టేజి వద్ద బస్సు దిగి వస్తుండగా అప్పటికే పక్కా సమాచారంతో కాపేగాస్తున్న పోలీసులకు అనుమానాస్పదంగా కనిపించారు. వారిని అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. ముగ్గురు నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్‌ఐ నాగరాజు తెలిపారు.

ఇంటి పైనుంచి పడి వ్యక్తి మృతి


స్వామి (ఫైల్)

వలిగొండ : ప్రమాదవశాత్తు ఇంటి పైనుంచి పడి ఓ వ్యక్తి మృతిచెందాడు. వలిగొండ మండలం పహిల్వాన్‌పురం గ్రామంలో చోటు చేసుకున్న ఈ ఘటన వివరాలు ఇలా ఉన్నాయి. పహిల్వాన్‌పురం గ్రామానికి చెందిన కర్రె స్వామి(42) అదే గ్రామంలో ఉంటున్న తన మామ దేశగాని కృష్ణయ్య కొత్తగా ఇంటి నిర్మాణం చేసుకుంటున్నాడు. నిర్మాణ పనులు చేస్తున్న కూలీలకు కృష్ణయ్య కొత్త ఇంటి వద్ద ఆదివారం విందు ఏర్పాటు చేశాడు. ఆ విందుకు కూతురు, అల్లుడితో పాటు ఇతర బంధువులను కూడా ఆహ్వానించాడు. విందు అనంతరం రాత్రి కర్రె స్వామి కుటుంబ సభ్యులు, ఇతర బంధువులతో కలసి కొత్త ఇంటిపై పడుకున్నారు. సోమవారం తెల్లవారుజామున 5 గంటల సమయంలో ఎదురింటిలో ఉంటున్న బొడ్డుపల్లి రాజయ్య బయటికి వచ్చే సరికి రోడ్డుపై తీవ్రగాయాలతో స్పృహతప్పి పడి ఉన్న కర్రె స్వామిని గుర్తించి కుటుంబ సభ్యులకు తెలిపాడు. వారు వచ్చి చూసే సరికి అప్పటికే స్వామి మృతిచెందాడు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రామన్నపేట ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ప్రభాకర్ తెలిపారు.

విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్రగాయాలు


గాయపడిన బాలుడు

మాడుగులపల్లి: విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలయ్యాయి. మాడుగులపల్లికి చెందిన సంపంగి వెంకన్న-విజయ దంపతులకు ముగ్గురు కుమారులు సంతానం.పెద్ద కుమారుడు సూర్య (10) స్థానిక ప్రాథమిక పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం స్వాతంత్ర్య దినోత్సవం కావడంతో జెండా పెట్టుకునేందుకు కర్ర కోసం సోమవారం సాయంత్రం ఇంటికి రాగానే సమీపంలోని పొలాల్లోకి వెళ్లి వేప చెట్టు ఎక్కాడు. కర్రను కొట్టే క్రమంలో చెట్టుకు ఆనుకొని ఉన్న 11 కేవీ విద్యుత్ తీగలు తగలడంతో విద్యుదాఘాతానికి గురై చేతులు, కాళ్లు, పొట్ట భాగంలో తీవ్రంగా గాయాలయ్యాయి. స్థానికులు గుర్తించి చెట్టు పైనుంచి వేలాడుతున్న బాలుడిని రక్షించి 108 సిబ్బందికి సమాచారం ఇచ్చారు. అప్పటికే అపస్మారక స్థితికి చేరడంతో 108 సిబ్బంది సీపీఆర్ చేయడంతో స్పృహలోకి వచ్చాడు. బాలుడిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హైదరాబాద్‌కు తీసుకెళ్లినట్లు సమాచారం.

చీదెళ్లలో విషాదం


చీదెళ్లలో మృతదేహాల వద్ద రోదిస్తున్న బంధువులు

పెన్‌పహాడ్ : పండుగకు వెళ్లి తిరిగి వస్తున్న తాత మనవళ్లు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో పెన్‌పహాడ్ మండల పరిధిలోని చీదెళ్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. గ్రామానికి చెందిన దేశగాని సైదులు, మనమడు అరవింద్‌లు సూర్యాపేట పట్టణంలో ఆదివారం తన కూతురు నిర్వహించిన బోనాల పండుగకు హాజరై బైక్‌పై తిరిగి ఇంటికి వస్తున్న క్రమంలో మునగాల మండలం మాధవరం గ్రామ శివారులో కారు ఢీకొట్టిన విషయం తెలిసిందే. ప్రమాదంలో తాత సైదులు అక్కడికక్కడే మృతి చెందగా తీవ్ర గాయాలైన అరవింద్‌ను హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో మృతిచెందాడు. ఒకే కుటుంబానికి చెందిన తాతా,మనుమడు మృతిచెందడంతో కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. సోమవారం నిర్వహించన అంత్యక్రియల్లో గ్రామస్తులు, బంధువులు పెద్ద సంఖ్యలో పాల్గొని కన్నీరుమున్నీరయ్యారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు

● నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్


సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్

నల్లగొండ : విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని కలెక్టర్ ఆర్.వి కర్ణన్ అధికారులను హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో లీడ్ బ్యాంక్ ఆధ్వర్యంలో స్పెషల్ డీఎల్‌ఆర్‌సీ, డీసీసీ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ, తదితర శాఖల రుణాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డీఆర్‌డీఏ పరిధిలో మహిళా సంఘాలకు ఇచ్చిన రుణాల టార్గెట్ ఎందుకు పూర్తి చేయలేదని ప్రశ్నించారు. రుణాల విషయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను మానిటరింగ్ చేయాలని సూచించారు. జిల్లాలో వ్యవసాయ రుణాలు తీసుకున్న వారి వివరాలు వ్యవసాయ శాఖ జేడీని అడిగి తెలుసుకున్నారు. మెప్మా అధికారులు పట్టణ ప్రాంత మహిళా సంఘాలకు ఎక్కువ మొత్తంలో రుణాలు ఇప్పించే ప్రయత్నం చేయాలన్నారు. పీఏ పల్లి, దేవరకొండ, మిర్యాలగూడ ప్రాంత గిరిజనులకు రుణాలు అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ అధికారిని, జెడ్పీసీఈఓను ఆదేశించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ శ్రామిక్ 2023-24 ఆర్థిక సంవత్సరం ప్రగతి నివేదిక చదివి వినిపించారు. అదనపు కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, ఆర్‌బీఐ ఎల్డీఓ గోమతి, నాబార్డ్ డీడీఎం వినయ్‌కుమార్, వ్యవసాయ శాఖ జేడీ సుచరిత, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, గిరిజన సంక్షేమ అధికారి రాజ్‌కుమార్, పరిశ్రమల శాఖ మేనేజర్ కోటేశ్వరరావు, డీఈఆర్డీఓ కాళిందిని పాల్గొన్నారు.

పల్లె దవాఖానాలను పూర్తి చేయాలి

నెలరోజుల్లోగా పల్లె దవాఖానాలు పూర్తి చేయాలని సంబంధిత అధికారులను నల్లగొండ కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ ఆదేశించారు. సోమవారం తన కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నల్లగొండ జిల్లాలో 164 పల్లె దవాఖాన భవనాలు మంజూరు చేయగా 140 పంచాయతీ రాజ్ శాఖ, 24 వైద్య ఆరోగ్య మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. వైద్య మౌలిక సదుపాయాల సంస్థ ఇంజనీరింగ్ శాఖ ద్వారా 24 చేపట్టగా 7 పూర్తి చేసినట్లు ,ఒకటి భూ సమస్య వుందని అధికారులు వివరించారు. జీ.పి. భవనాలు మంజూరు చేసిన వాటికి గ్రౌండింగ్ చేసి త్వరిత గతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లు హేమంత్ కేశవ్, జె.శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ ప్రేమ్ కరణ్‌రెడ్డి, జిల్లా వైద్యాధికారి కొండల్‌రావు డీపీఓ విష్ణువర్ధన్ రెడ్డి తదిదతరులు పాల్గొన్నారు. అదే విధంగా మాన్యువల్ స్కావెంజర్స్ విజిలెన్స్ కమిటీ సమావేశంలో కూడా కలెక్టర్ మాట్లాడారు.

16నుంచి ఇంటింటి సర్వే

కుష్టు వ్యాధి లక్షణాలను కలిగిన వారిని గుర్తించేందుకు ఈ నెల 16నుంచి 31 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్లు కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ తెలిపారు. సోమవారం తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆశ కార్యకర్తలు, ఒక వలంటీర్ టీమ్‌లు ఏర్పాటు చేసి కుష్టు వ్యాధి లక్షణాలు గల వారిని గుర్తించాలన్నారు. అన్ని గురుకుల విద్యాలయాల్లో ఇలాంటి లక్షణాలు వుంటే ఆయా శాఖల అర్‌సీఓలు, డిగ్రీ కళాశాల ల అధ్యాపకులు, పాఠశాలలు, హాస్టళ్ల, గ్రామాల్లో సమీప ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ కు, జిల్లా కుష్టు నివారణ అధికారికి తెలపాలన్నారు. సమావేశంలో డీఎంహెచ్ఓ కొండల్‌రావు, కుష్టు నివారణ ప్రోగ్రాం అధికారి డా. టి. హరికృష్ణ పాల్గొన్నారు.

ప్రశంసాపత్రాలు అందుకోనున్న ఉద్యోగులు

వివిధ శాఖల్లో ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగులు పంద్రాగష్టు సందర్భంగా ప్రశంసా పత్రాలు అందుకోనున్నారు. ఆయా శాఖ వారీగా ఉత్తమ సేవలు అందించిన అధికారులు, ఉద్యోగుల జాబితాను కలెక్టర్ కర్ణన్ ఒక ప్రకటనలో వెల్లడించారు. మొత్తం వివిధ శాఖల్లో 283 మంది అధికారులు, సిబ్బందికి మంగళవారం అవార్డులు, ప్రశంసాపత్రాలు అందించనున్నారు.

క్లుప్తంగా

స్వీపర్లకు యూటీఎఫ్ మద్దతు

నల్లగొండ టౌన్ : తమను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా పరిషత్, మండల పరిషత్ పాఠశాలల్లో పనిచేస్తున్న స్వీపర్లు జిల్లా పరిషత్ కార్యాలయం ఎదుట 52 రోజులుగా చేస్తున్న నిరసనకు సోమవారం యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఎడ్ల సైదులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో దండెంపల్లి సత్యయ్య, పూలమ్మ, నాగయ్య, కృష్ణవేణి, వెంకటనారాయణ, అండాలు, మల్లయ్యలు పాల్గొన్నారు.

వచ్చేది కాంగ్రెస్ రాజ్యమే


కరపత్రాలు అందజేస్తున్న దైద రవీందర్

నకిరేకల్ : రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ రాజ్యమేనని టీ పీసీసీ నేత దైద రవీందర్ అన్నారు. నకిరేకల్ మున్సిపాలిటీలోని 2వ వార్డులో సోమవారం ఆయన ఇంటింటా పర్యటించి కాంగ్రెస్ పార్టీ హామీలు–ప్రగతికి సోపానాల ప్రచార కరపత్రాలను పంపిణీ చేసి మాట్లాడారు. రాపోలు నగేష్, చెరుపల్లి సైదులు, ధనమ్మ, కొలను సతీష్, మార్కండేయ, ఎన్నం వెంకటేష్, ఏలలింగయ్య, రాపోలు ఉపేందర్, అప్పం జానకి రాములు తదితరులు పాల్గొన్నారు.

నేడు కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

మునుగోడు : మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన పలువురు లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను మంగళవారం మునుగోడులోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి పంపిణీ చేయనున్నట్లు డిప్యూటీ తహసీల్దార్ ఎన్. నరేష్ ఒక ప్రకటనలో తెలిపారు. లబ్ధిదారులు సకాలంలో వచ్చి చెక్కులు తీసుకోవాలని కోరారు.

పోస్టాఫీసులో ఫొటో ఎగ్జిబిషన్

రామగిరి(నల్లగొండ): నల్లగొండ హెడ్ పోస్టాఫీసులో విభజన భయానక జ్ఞాపకాల దినం సందర్భంగా భారత దేశ విభజన సమయం నాటి పరిస్థితులను తెలియజేసే చిత్రాలతో సోమవారం ఫొటో ఎగ్జిబిషన్ నిర్వహించారు. నల్లగొండ డీఎస్పీ ఎం.శ్రీధర్‌రెడ్డి ఫొటో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పోస్టల్ డివిజనల్ సూపరింటెండెంట్ కె.రఘునాథ స్వామి, సిబ్బంది అశోక్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


వేడుకల్లో పాల్గొన్న ఆలయ కమిటీ ప్రతినిధులు

నకిరేకల్ : పట్టణంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజులుగా కొనసాగిన బ్రహ్మోత్సవాలు ముగిశాయి. సోమవారం పూర్ణాహుతి, పుష్పయాగం, ఏకాంత సేవలను ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో ఆలయ చైర్‌పర్సన్ కందాల శోభారాణిశ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు యల్లపురెడ్డి సైదిరెడ్డి, మాజీ ఎంపీటీసీ గుర్రం గణేష్, వార్డు కౌన్సిలర్ కొండ శ్రీను, ధర్మకర్తలు సోమ సుధాకర్, పెండెం ఆంజనేయులు, గిద్దె అంజయ్య, ఎరుకుల లక్ష్మీ, సాయి పాల్గొన్నారు.

ఎన్‌సీసీ కేడెట్ల ర్యాలీ


ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ ఘనశ్యామ్

రామగిరి(నల్లగొండ) : స్వాతంత్య్ర వేడుకల్లో భాగంగా అమరవీరులకు నివాళులర్పిస్తూ సోమవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల ఎన్‌సీసీ కేడెట్లు ఎన్జీ కళాశాల నుంచి క్లాక్ టవర్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్ ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ఎన్‌సీసీ ఇన్‌చార్జ్ వేముల వెంకటేశం, పీడీ కడారి మల్లేష్, లైబ్రేరియన్ డాక్టర్ దుర్గాప్రసాద్, ఎన్‌సీసీ ఆఫీసర్స్ సోహన్‌లాల్, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఎన్జీ కళాశాలలో మేరీ మాటీ మేరా దేశ్

రామగిరి(నల్లగొండ): ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా సోమవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మేరీ మాటీ మేరా దేశ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధ్యాపకులు, ఎన్ఎస్ఎస్ వలంటీర్లు ప్రతిజ్ఞ చేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఘనశ్యామ్, అధ్యాపకులు డాక్టర్ ప్రసన్నకుమార్, కడారి మల్లేష్, డాక్టర్ దుర్గాప్రసాద్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు ఈ.యాదగిరిరెడ్డి, ఎన్.వేణు, ఎస్.యాదగిరి, ఎం.వెంకట్‌రెడ్డి, గంజి భాగ్యలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న 'మురుగు' కష్టాలు

- మునుగోడులో ముమ్మరంగా సాగుతున్న డ్రెయినేజీ నిర్మాణ పనులు
- హర్షం వ్యక్తం చేస్తున్న ప్రజలు


డ్రెయినేజీపై సీసీ స్లాబు వేస్తున్న కార్మికులు

మునుగోడు : నియోజకవర్గ కేంద్రమైన మునుగోడులో సరైన మురికి కాల్వలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామంలోని ప్రజలు వినియోగించిన మురుగు, వర్షం కురిసిన సమయంలో పారే వరద నీరు గ్రామ శివారులోని వాగులోకి మళ్లించేందుకు 20 ఏళ్ల క్రితం నిర్మించిన కాల్వ ఐదేళ్ల క్రితం పూర్తిగా ధ్వంసమైంది. దీంతో ఆ కాల్వలో మురుగు నిలిచి దుర్వాసన వెదజల్లుతోంది. అందులో దోమలు, ఈగలు ఆవాసాలు ఏర్పరచుకుని చుట్టుపక్కల నివాసం ఉండే ప్రజలు అనారోగ్యం బారిన పడేలా చేస్తున్నాయి. మండల కేంద్రంలో ప్రతి ఏటా 100 నుంచి 200 మంది డెంగ్యూ, మలేరియా వ్యాధుల బారిన పడి ఆస్పత్రుల్లో చికిత్సపొందుతున్నారు. ఒకరిద్దరు మరణించిన సంఘటనలు కూడా ఉన్నాయి. ప్రధానంగా ఈ సమస్య దళిత కాలనీల్లో నెలకొంది. దానిని గమనించిన స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి ప్రత్యేక దృష్టిసారించి ధ్వంసమైన కాల్వను పరిశీలించి డ్రెయినేజీ నిర్మాణానికి రూ.29.31 లక్షల ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరు చేయించారు. ఆ నిధులు సరిపోకపోవడంతో మరోసారి అధికారులు ప్రతిపాదనలు పంపారు.

కొనసాగుతున్న పనులు

మునుగోడులోని ప్రధాన కూడలి దుకాణాల సముదాయం వెనుక భాగం నుంచి బీసీ కాలనీ, దళిత కాలనీల మీదుగా మార్కెట్ యార్డు ప్రహరీ వరకు 10 మీటర్ల వెడల్పు, 450 మీటర్ల పొడవుతో డ్రెయినేజీ నిర్మాణం చేపడుతున్నారు. డ్రెయినేజీ నిర్మాణం పూర్తయితే ప్రజల ఇళ్లలో వినియోగించిన నీటితోపాటు వర్షపు నీరు సులువుగా వాగులో కలవనుంది. గతంలో ఉన్న కాల్వ అంతా ధ్వంసమై మురుగు ఎటూ వెళ్లకుండా వర్షం వచ్చిన సమయంలో వర్షపు నీరు, మురుగు ప్రజల ఇళ్లలోకి వచ్చేది. డ్రెయినేజీ నిర్మిస్తుండడంతో మురికినీటి సమస్య తీరనుందని ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపాం



డ్రెయినేజీ నిర్మాణానికి ఎస్‌డీఎఫ్ నిధుల నుంచి రూ.29.31 లక్షలు మంజూరు కాగా పనులు నెల రోజుల క్రితం ప్రారంభించాం. కానీ ఆ నిధులతో పని పూర్తికాకపోవడంతో ఎమ్మెల్యే సూచన ప్రకారం డ్రెయినేజీ పనులు కొనసాగిస్తున్నాం. అదనపు నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపించాం.

– రామకృష్ణ, పంచాయతీరాజ్ ఏఈ

సమస్య తీరనుంది



మా కాలనీలో ఇళ్ల మధ్య ఉన్న మురికి కాల్వ పూర్తిగా ధ్వంసం కావడంతో మురుగు నిల్వ ఉండి దుర్వాసన వచ్చేది. అంతేకాకుండా దోమలు, ఈగలు అధికమై వర్షాకాలంలో డెంగ్యూ, మలేరియా వ్యాధులకు గురయ్యేవాళ్లం. మురికి కాల్వ నిర్మిస్తుండడంతో సమస్య తీరనుంది.

–పెరమాండ్ల కుమారి, మునుగోడు దళిత కాలనీ

శాలిగౌరారం ప్రాజెక్టు పరిశీలన


హెడ్ రెగ్యులేటర్‌ను పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి ఎఫెక్ట్..

శాలిగౌరారం : శాలిగౌరారం ప్రాజెక్టు కింద ఆయకట్టు చివరి భూములకు సాగునీరందకపోవడంతో రైతులు పడుతున్న ఇబ్బందుల నేపథ్యంలో 'సాక్షి'దినపత్రికలో సోమవారం 'చివరికి అందని సాగునీరు' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి నీటిపారుదలశాఖ అధికారులు స్పందించారు. శాలిగౌరారం ప్రాజెక్టుతోపాటు ప్రాజెక్టులోకి రాచకాల్వ ద్వారా నీరువచ్చే రామన్నపేట మండలం పల్లివాడ వద్ద మూసీనదిపై ఉన్న హెడ్‌రెగ్యులేటర్‌ను నీటిపారుదల శాఖ ఈఈ విజయ్‌కుమార్, డీఈఈ సత్యనారాయణ సోమవారం పరిశీలించారు. ప్రాజెక్టు ప్రధాన కుడి, ఎడమ కాల్వలలో పేరుకుపోయిన పూడిక వల్ల సాగునీరు ప్రవహించడం ఇబ్బందికరంగా మారిందని సిబ్బంది అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టులోకి నీరువచ్చేందుకు పల్లివాడ, తుర్కపల్లి వద్ద ధ్వంసమైన షట్టర్లకు మరమ్మతులతో పాటూ రాచకాల్వ పటిష్టతకు ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టు ఆయకట్టు చివరి భూములకు సాగునీరందేందుకు చర్యలు తీసుకోనున్నట్లు వివరించారు. వారివెంట జేఈ అమర్, ఏఈ రాములు, చామల వెంకటరమణారెడ్డి, రైతులు ఉన్నారు.

గుండెపోటుతో ఆర్ఎస్ఐ భార్య మృతి


చైతన్య

నల్లగొండ క్రైం : అన్నెపర్తి 12 బెటాలియన్‌లో సోమవారం గుండెపోటుతో ఆర్ఎస్ఐ కె.మహేష్ భార్య చైతన్య (27) మృతి చెందారు. గుర్రంపోడు మండలం పోచంపల్లి గ్రామానికి చెందిన మహేష్–చైతన్య తమ కుమార్తెకు ఆదివారం స్వగ్రామంలో డోలారోహణం కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం బెటాలియన్‌కు వచ్చారు. ఇళ్లు ఊడ్చుతుండగా చైతన్య సొమ్మసిల్లి పడిపోవడంతో బెటాలియన్‌లోని అంబులెన్స్ ద్వారా నల్లగొండలో ఒ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా అప్పటి ఆమె మృతి చెందినట్లు వైద్యులు ధృవీకరించారు. బెటాలియన్ పోలీసులు చైతన్య మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామంలో అంత్యక్రియలకు మృతదేహాన్ని తరలించారు.

సంపద వనానికి స్థల పరిశీలన

కనగల్ : మండల పరిధిలోని జి యడవల్లి గ్రామంలో సంపద వనం ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించి పనులు మొదలు పెట్టాలని డీఆర్‌డీఓ కాళిందిని ఆదివారం అధికారులను ఆదేశించారు. సోమవారం ఎంపీడీఓ సోమసుందర్‌రెడ్డి అధికారులతో కలిసి గ్రామంలో సంపద వనం ఏర్పాటుకు స్థలాన్ని గుర్తించారు. 2.5 ఎకరాల్లో 3000 సంపద మొక్కలను నాటేందుకు పనులు పనులు మొదలు పెట్టినట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీఓ ముజవుద్దీన్, పీఆర్ ఏఈ శ్రీనివాస్, ఏపీవో సుధాకర్, సర్పంచ్ పులకరం యాదమ్మమారయ్య, పంచాయతీ కార్యదర్శి ఖాసీం, టీఏ రమేష్, సర్వేయర్ శ్రీనివాస్ తదితరులున్నారు.

రెండో విడత గొర్రెల పంపిణీ పూర్తి చేయాలని వినతి

మాడుగులపల్లి: రెండో విడత గొర్రెల యూనిట్ల కోసం డీడీలు చెల్లించిన లబ్ధిదారులకు వెంటనే పంపిణీ పూర్తి చేయాలని కోరుతూ గొర్రెలు, మేకల పెంపకందారుల సహకారం సంఘం డివిజన్ అధ్యక్షుడు ఊరిబండి శ్రీనివాస్ సోమవారం కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ కర్ణన్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వం సకాలంలో గొర్రెల యూనిట్లు పంపిణీ చేయకపోవడంతో అప్పులు తెచ్చి డీడీలు చెల్లించిన గొల్ల, కురుమలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గొర్రెలు పంపిణీ చేస్తే కృష్ణ, గుంటూరు, ప్రకాశం జిల్లాల నుంచే కొనుగోలు చేసి ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. ఆయన వెంట సంఘానికి చెందిన పలువురు సభ్యులు ఉన్నారు.

కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ


చిట్యాల : ఏపూరులో సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి

చిట్యాల : సీఎం కేసీఆర్ పాలనలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. చిట్యాల మండలం ఏపూరు గ్రామంలో కోటి పదిహేను లక్షల నిధులతో నిర్మించనున్న సీసీ రోడ్లు, డ్రెయినేజీల నిర్మాణ పనులకు, మూడు కోట్ల నాలుగు లక్షలతో గుండ్రాంపల్లి–పేరేపల్లి గ్రామాల మధ్య నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు, ఐదులక్షల రూపాయలతో లారీ డ్రైవర్స్ అసోసియేషన్ భవన ప్రహరీ నిర్మాణ పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నకిరేకల్ నియోజకవర్గంలోని గ్రామాల్లో సమస్యలన్నింటినీ దశలవారీగా పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కొలను సునిత, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ, సర్పంచ్ పాలెం మాధవి, ఏఎంసీ చైర్మన్ జడల ఆదిమల్లయ్య, మాజీ వైస్ ఎంపీపీ పాలెం మల్లేష్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు అవుల అయిలయ్య, మండల ప్రధాన కార్యదర్శి కల్లూరి మల్లారెడ్డి పాల్గొన్నారు.

పల్లెలను సస్యశ్యామలం చేయడమే లక్ష్యం

నకిరేకల్ : పల్లెలన్నింటినీ సస్యశ్యామలం చేయడమే బీఆర్ఎస్ ప్రభుత్వ లక్ష్యమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండలంలోని నడిగూడెం గ్రామంలో రూ.20 లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ పంచాయతీ కార్యాలయ భవనాన్ని సోమవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. గ్రామాలు అభివృద్ధి చెందితేనే దేశం అభివృద్ధి చెందుతుందని భావించిన సీఎం కేసీఆర్.. 500 జనాభా కలిగిన ప్రతి గ్రామాన్ని గ్రామ పంచాయతీగా ఏర్పాటు చేశారని అన్నారు. స్థానిక సర్పంచ్ మాద నాగరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మాద ధనలక్ష్మీనగేష్, వైస్ ఎంపీపీ గోర్ల సరితావీరయ్య, మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, ఎంపీడీఓ అండాలు, పీఏసీఎస్ చైర్మన్ పల్‌రెడ్డి మహిందర్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, రాచకొండ సునీల్‌గౌడ్, వెంకట్‌గౌడ్, పెండెం సదానందం తదితరులు పాల్గొన్నారు.

108,102 అంబులెన్స్ ప్రారంభం

నకిరేకల్‌లోని 100 పడకల వైద్యశాలకు మంజూరైన 108, 102 అంబులెన్స్ వాహనాలను సోమవారం ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా


ధర్నా చేస్తున్న మునుకుంట్ల గ్రామస్తులు

కట్టంగూర్ : మండలంలోని మునుకుంట్ల గ్రామానికి చెందిన వ్యవసాయేతర భూమిని అక్రమంగా పట్టా చేసుకున్న వారిపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గ్రామస్తులు సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ గ్రామ రెవెన్యూ పరిధిలో గల సర్వే నంబర్లు 2,3,5,8,9, 597, 772 లలో ఎ 4–31 గుంటల భూమి ఉందని, ఇట్టి భూమి విషయంలో స్థానిక అధికారులు ఉన్నతాధికారులకు తప్పుడు ధృవీకరణ పత్రాలు పంపి అక్రమ పట్టాలు ఇచ్చారని ఆరోపించారు. ఈ భూములకు రైతుబంధు పొందడంతోపాటు స్థలాలను కబ్జా చేసేందుకు వీలుగా కొంతమంది గ్రామపెద్దలు అధికారులతో కుమ్మక్కై అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అనంతరం తహసీల్దార్ డి స్వప్నకు వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గడుసు శంకర్ రెడ్డి, గద్దపాటి దానయ్య, యాదయ్య, రామలింగయ్య, శివ, రవి, ఎల్లయ్య, నాగయ్య ఉన్నారు.

రాబోయే ఎన్నికల్లో బీజేపీదే అధికారం


అభివాదం చేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ రూరల్ : రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడంతోపాటు నల్లగొండలో బీజేపీ జెండా ఎగురవేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగోని శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర నాయకుడు నాగం వర్షిత్‌రెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దీపకుంటలో నిర్వహించి ఆత్మీయ సమావేశంలో వారు మాట్లాడారు. రైతు రుణమాఫీ వడ్డీకే సరిపోయిందని అన్నారు. పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇస్తామని బీఆర్ఎస్ ప్రభుత్వం మాట తప్పిందని అన్నారు. నేడు సొంత జాగా ఉంటే రూ. 5లక్షలు ఇస్తామని కేటీఆర్ చట్ట సభలో ప్రకటించి నేడు గృహలక్ష్మి పేరిట రూ.3 లక్షలే ఇస్తామనడం పేదలను మాయమాటలతో మోసం చేయడమే అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శి పోతెపాక సాంబయ్య, జిల్లా అధికార ప్రతినిధి బోగరి అనిల్, మండల అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి రేగట్టె రుక్మాగౌడ్, శంకర్‌రెడ్డి, నర్సింహ, సుధాకర్, కొత్తపల్లి ప్రమోద్, వెంకట్‌రెడ్డి, వెంకటేష్, భార్గవి, అంజయ్య, సైదులు గౌడ్, చామకూరి మహేష్, తదితరులు పాల్గొన్నారు.

గద్దర్ ఆశయ సాధనకు కృషి


నివాళులర్పిస్తున్న నాయకులు

మునుగోడు : బడుగు, బలహీన వర్గాల అభివృద్ధికి తన జీవితకాలం పరితపించిన గద్దర్ ఆశయ సాధనకు కృషిచేస్తామని వివిధ సంఘాల, పార్టీల నాయకులు అన్నారు. మునుగోడులోని రైతు వేదికలో సోమవారం ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గద్దర్ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా గద్దర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కళాకారులు గద్దర్ పాటలు పాడి అలరించారు. ఈ కార్యక్రమంలో డోల్‌దెబ్బ రాష్ట్ర అధ్యక్షుడు మాలిగ యాదయ్య, బూడిద లింగయ్య యాదవ్, నారపాక అంజి, నెల్లికంటి రాఘవేంద్ర, భవనం మధుసూదన్ రెడ్డి, గట్టుపల్లి నర్సిరెడ్డి, కోరె సాయిరాం, పిట్టల రాములు, వనం లింగయ్య, శివరాత్రి రాములు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మహాసభల పోస్టర్ ఆవిష్కరణ

నల్లగొండ టౌన్ : జిల్లా కేంద్రంలో సెప్టెంబర్ 4,5 తేదీల్లో నిర్వహించనున్న చేనేత కార్మిక సంఘం రాష్ట్ర రెండో మహాసభలను జయప్రదం చేయాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గంజి మురళీధర్ పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక ఎస్‌పీటీ మార్కెట్‌లో మహాసభల పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మిర్యాల సోమయ్య, రాపోలు దత్తగణేష్, జెల్ల భిక్షం, మిర్యాల యాదగిరి, కర్నాటి యాదగిరి, దుడుకు లక్ష్మీనారాయణ, చిలుకూరు లక్ష్మీనర్సు, దండంపెల్లి సత్తయ్య, గణేష్, శ్రీరంగం, వెంకన్న, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

ఓటు హక్కుపై అవగాహనకు 5 కే రన్


మాట్లాడుతున్న కలెక్టర్ కర్ణన్

నల్లగొండ : ఎన్నికల సంఘం ఆదేశాలమేరకు ఈ నెల 19వ తేదీన అన్ని నియోజకవర్గ కేంద్రాల్లో 'నేను కచ్చితంగా ఓటు వేస్తాను ' అనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఉదయం 6 గంటలకు 5 కే రన్ నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఆర్.వి.కర్ణన్ తెలిపారు. సోమవారం కలెక్టర్ కార్యాలయంలో ఓటర్ నమోదు అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆర్‌ఓలు, ఈఆర్‌ఓలు 5 కే రన్ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌జీఓలు, ఎన్‌సీసీ, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు భారీ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 21న ముసాయిదా ఓటర్ జాబితా ప్రకటించనున్నట్లు తెలిపారు. 21 నుంచి సెప్టెంబర్ 19వ తేదీ వరకు ముసాయిదా ఓటర్ జాబితాపై అభ్యంతరాలు స్వీకరించి, సెప్టెంబర్ 28వ తేదీలోగా విచారణ చేస్తారని అన్నారు. 2023 అక్టోబర్ 4న తుది ఓటర్ జాబితా ప్రకటించనున్నట్లు వెల్లడించారు. జిల్లాలోని అన్ని పోలింగ్ బూత్‌లలో బూత్ లెవల్ ఏజెంట్లను నియమించుకోవాలని రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. ఈ సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు బక్క పిచ్చయ్య, పోతెపాక లింగస్వామి, శంకర్ నాయక్, నర్సిరెడ్డి, వింటెపాక యాదగిరి, షేక్ మోయిన్, మల్లికార్జున్, చొల్లేటి ప్రభాకర్, కార్యాలయ సూపరింటెండెంట్ కృష్ణమూర్తి, ఎన్నికల డీటీ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

బీసీల అభ్యున్నతే ప్రభుత్వ ధ్యేయం


చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే కంచర్ల

నల్లగొండ టూటౌన్ : కులవృత్తులు, బీసీల అభ్యున్నతే ధ్యేయంగా కేసీఆర్ ప్రభుత్వం పని చేస్తోందని నల్లగొండ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డి అన్నారు. నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గంలో బీసీబంధు పథకానికి ఎంపికైన 300 మంది లబ్ధిదారులకు సోమవారం నల్లగొండలోని వీటీ కాలనీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రూ.3 కోట్ల విలువ గల చెక్కులను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అట్టడుగున ఉన్న అన్ని వర్గాల సంక్షేమం కోసం ప్రభుత్వ వేల కోట్లు ఖర్చు పెడుతోందన్నారు. కులవృత్తుల వారు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని ఇతరులకు ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని కోరారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ ఆర్డీఓ రవి, మున్సిపల్ చైర్మన్ మందడి సైదిరెడ్డి, ఎంపీపీలు విజయలక్ష్మి, కరీంపాషా, జెడ్పీటీసీలు పాశం రాంరెడ్డి, చిట్ల వెంకటేశం, ఎంబీసీ జాతీయ కన్వీనర్ కొండూరు సత్యనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్‌గౌడ్, ఆలకుంట్ల నాగరత్నంరాజు తదితరులు పాల్గొన్నారు.

రైతు బిడ్డను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపండి


తాస్కానిగూడెంలో మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

చండూరు : 'మునుగోడు నియోజకవర్గ రైతు బిడ్డను.. త్వరలో జరగబోయే ఎన్నికల్లో తనను ఆశీర్వదించి అసెంబ్లీకి పంపించండి' అని టీ పీసీసీ ప్రధాన కార్యదర్శి చలమల్ల కృష్ణారెడ్డి అన్నారు. ప్రజాచైతన్య యాత్రలో భాగంగా ఆరో రోజు మండల పరిధిలోని నెర్మట, కొండాపురం, పుల్లెంల, తాస్కానిగూడెం గ్రామాల్లో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో నేటికి 92 గ్రామాలకు రోడ్లు లేవని ఆవేదన వ్యక్తం చేశారు. భూనిర్వాసితులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోడి గిరిబాబు, చెరుపల్లి సత్యనారాయణ, భీమగాని మల్లేశం, బురకల భిక్షం, పాలకూరి రాజు, రాఘవేందర్, వంగూరి యాదయ్య, రావుల రమేష్, పాలకూరి రాజు, బెల్లంకొండ శేఖర్, చొప్పరి రాజు, మారయ్య తదితరులు పాల్గొన్నారు.

నిరుపేదలకు సేవచేయడమే కేవీఎస్ ఫౌండేషన్ లక్ష్యం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్

చండూరు: నిరుపేదలకు సేవలందించడమే కేవీఎస్ ఫౌండేషన్ లక్ష్యమని ఫౌండేషన్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు కర్నాటి విద్యాసాగర్ అన్నారు. గట్టుప్పల్ మండల కేంద్రంలో కేవీఎస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా హైదరాబాద్ యశోద హాస్పిటల్ వారి సౌజన్యంతో దాదాపు 600 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు, తహసీల్దార్ లావణ్య, ఎస్ఐ ప్రవీణ్‌కుమార్, సర్పంచ్ ఇడెం రోజా, బీఆర్ ఎస్ మండల అధ్యక్షుడు ఈడం కైలాసం, ఫౌండేషన్ నిర్వాహకులు మాదగాని వెంకటేష్ గౌడ్, రమాశంకర్, చెరుపల్లి రమేష్, బరిగెల కృష్ణయ్య, రాజశేఖర్, దొంతరగొని వెంకటేష్, యాదగిరి, శంకర్, వేణు తదితరులు పాల్గొన్నారు.

16న ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ సభ

నల్లగొండ టౌన్ : ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ సభ ఈ నెల 16న స్థానిక గడియారం సెంటర్లో నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు మహరాజ్ తెలిపారు. సోమవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహరాజ్ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని పేర్కొన్నారు. జిల్లావ్యాప్తంగా ఉన్న బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ప్రజలు సభకు భారీ సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా ఉపాధ్యక్షులు శంకర్, గిరి, ప్రధాన కార్యదర్శి వెంకన్న, ఎల్లయ్య, శ్రీను, వినోద్ వంశీవర్ధన్, దినేష్, గణేష్ పాల్గొన్నారు.

కట్టంగూర్ : ఈ నెల 16న నల్లగొండలో నిర్వహించే ధర్మ సమాజ్ పార్టీ ఆవిర్భావ సభను విజయవంతం చేయాలని పార్టీ ప్రధాన కార్యదర్శి, నకిరేకల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ యాతా కుల వెంకన్నమహారాజ్ పిలుపునిచ్చారు. సోమవారం మండల కేంద్రంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆవిర్భావ సభకు పార్టీ అధినేత డాక్టర్ విశారదన్ మహా రాజ్ హాజరవుతారని తెలిపారు. పార్టీ నాయకులు అధికసంఖ్యలో పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో శేఖర్, గిరి, సురేష్, వెంకటేష్, శ్రీకాంత్, శివ పాల్గొన్నారు.

మర్రిగూడ : ఈ నెల 16న నల్లగొండలో నిర్వహించనున్న ధర్మసమాజ్ పార్టీ ఆవిర్భావ సభను జయప్రదం చేయాలని పార్టీ మండల ఇన్‌చార్జ్ లపంగి వినోద్ అన్నారు. సోమవారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ధర్మసమాజ్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు గిరి, వెంకటేష్, రాజు, జగన్, లక్ష్మణ్, భిక్షం, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సెప్టెంబర్ 3న బోనాలు

నకిరేకల్ : సెప్టెంబర్ 3వ తేదీన నకిరేకల్ మున్సిపాలిటీ కేంద్రంలో ముత్యాలమ్మ బోనాల పండుగ నిర్వహించాలని తీర్మానించినట్లు మున్సిపల్ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ముత్యాలమ్మ గుడి కమిటీ ఆధ్వర్యంలో పట్టణ ప్రముఖులు సమావేశమయ్యారు. అందరి ఆమోదం మేరకు బోనాల తేదీ ఖరారు చేశామన్నారు. మున్సిపల్ కమిషనర్ బాలాజీ, వైస్ చైర్‌పర్సన్ మురారిశెట్టి ఉమారాణి కృష్ణమూర్తి, ముత్యాలమ్మ గుడి చైర్మన్ నడికుడి వెంకటేశ్వర్లు, చౌగోని సైదులుగౌడ్, కందాల భిక్షంరెడ్డి, యాతాకుల కిరణ్, కందాల నారాయణరెడ్డి, పన్నాల రాఘవరెడ్డి, కొండ జానయ్యగౌడ్, యల్లపురెడ్డి సైదిరెడ్డి, పెండెం సదానందం, పల్లె విజయ్, సాకుంట్ల నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

బూర్గు అంజయ్యకు నివాళి

కట్టంగూర్ : మండలంలోని ఈదులూరు గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్, తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ సీనియర్ నాయకుడు బూర్గు అంజయ్య 20వ వర్ధంతిని ఆపార్టీ నాయకులు సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని అంజయ్య విగ్రహానికి న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మండారి డేవిడ్ కుమార్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐతగోని నారాయణగౌడ్, చిరంజీవి, ఇందూర్ సాగర్, పుట్ట సత్యం, పీవైఎల్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వెంకటేశ్వర్లు, బీవీ చారి, శ్రీనివాసరెడ్డి, భరత్ తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం తీసుకోవాలి

మాడుగులపల్లి: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవడంతో తల్లి, బిడ్డ ఆరోగ్యంగా ఉంటారని సీడీపీఓ చంద్రకళ అన్నారు. మండలంలోని పాములపహాడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆరోగ్యలక్ష్మి పథకంలో భాగంగా సోమవారం గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్ ఆధ్వర్యంలో భోజనాలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి సీడీపీఓ చంద్రకళ హాజరై పౌష్టికాహారం ఆవశ్యకత గురించి వివరించారు. గర్భిణులు సకాలంలో వైద్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఐరన్, కాల్షియం మాత్రలు తప్పనిసరిగా వేసుకోవాలని, పుట్టిన ఆరు నెలలలోపు శిశువుకు తల్లిపాలే పట్టాలన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ యాతం లక్ష్మి, వైద్యాధికారి సత్యనారాయణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు రజిని, సునీత, నాగమణి, పీహెచ్ఎన్ జయలక్ష్మి, ఆరోగ్య పరిశీలకురాలు రాణి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

నకిరేకల్ : ఆజాదీకా అమృత్ మహోత్సవ్ కార్యక్రమంలో భాగంగా నకిరేకల్‌లో సోమవారం బీజేపీ ఆధ్వర్యంలో జాతీయ పతాకాలతో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని బీజేపీ నాయకులు నకిరేకంటి మొగిలయ్య, మండల వెంకన్న, మైల నర్సింహ, పల్స శ్రీనివాస్‌గౌడ్, గుడుగుంట్ల సాయన్న, జిల్లా డాకయ్య, యానాల శ్రీనివాస్‌రెడ్డి, చెరుకు రోశయ్య, బుడిగె సైదులు తదితరులు పాల్గొన్నారు.


ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు